Janampower.in
TELTEL/2016/69862

# జనం పవర్

తెలుగు దినపత్రిక
JANAM POWER

కరీంనగర్ ఆదివారం 22.03.2026 సంపుటి : 14 సంచిక : 286 పేజీలు: 11 వెల: 5/-
Karimnagar Sunday 22.03.2026 Valume : 14 Issue : 286 Pages : 11 Cost: 5/-



Editor: BANDARI MARUTHI

## ఇరాన్ యుద్ధం.. తీవ్ర రూపం




- దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్ హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం

4

### యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్



## మారుతున్న యుద్ధరీతులు



3

- యువత దేశ రక్షణకు నడుం బిగించాలి
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

### డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

2



### అర గ్యారంటీ కూడా అమలు కాలే

- వాటికి చట్టబద్ధత కల్పించాలని ప్రైవేట్ బిల్లు పెడతాం
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

3

### మొన్న భార్య.. నేడు భర్త

కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం



2

# సిద్దిపేటలో సరికొత్త శకం

రేపు సీఎం చేతుల మీదుగా 'నర్మెట్ట' ఫ్యాక్టరీ ప్రారంభం



- ఏర్పాట్లను ముమ్మరంగా పరిశీలించిన మంత్రులు తుమ్మల, పొన్నం
- 32 ఎకరాలు.. 300 కోట్లతో రికార్డు స్థాయి నిర్మాణం
- కేవలం 16 నెలల వ్యవధిలోనే పనులు పూర్తి కావడం విశేషం
- వ్యర్థాలతో 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

సిద్దిపేట జిల్లా నర్మెటలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భారీ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కర్మాగారం అట్టహాసంగా ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను ముమ్మరంగా పరిశీలించారు. 32 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో, 300 కోట్ల రూపాయల భారీ వ్యయంతో, కేవలం 16 నెలల రికార్డు కాలంలో పూర్తి చేసిన ఈ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణ రైతాంగానికి వరప్రదాయినిగా మారనుంది.

జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి

వివరాలు 2వ పేజీలో



### నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో రైతు మేళా

ఆధునిక సాంకేతికతతోనే అధిక దిగుబడులు
రైతులను ఉత్సాహపరిచిన వంగ రాజేశ్వర్ రెడ్డి

3



### శ్రమ మాది.. శిలాఫలకాలు మీవా?

- నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం
- కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం
- సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం
- ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్
- ప్రాంభోత్సవాలకు రావడం..రిబ్బన్ కట్ చేయడం మీ వంతా
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు

వివరాలు 3వ పేజీలో



### తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి



2

### జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు



2

- ప్రార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి
- పార్టీలో అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత
- భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి

# జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు





- పార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి
- పార్టీలో అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత
- భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి

జగిత్యాల,మార్చి21: పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్య ఉంటే అధిష్టానంతో మాట్లాడుదామని, పార్టీ మారే ఆలోచన మంచిది కాదని సూచించారు. దీనికి జీవన్ రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారంతో ఇద్దరు మంత్రులను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపు తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చించారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

# తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి



- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- హైదరాబాద్ ద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



**హైదరాబాద్,మార్చి21:** దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. తెలుగు రాష్టాల్లోనూ రంజాన్ శోభ కనిపించింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఇక, హైదరాబాద్ నగరం సైతం రంజాన్ వేడుకలకు సిద్ధమైంది. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు ముస్లిం సోదరులు. చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఇవాళ(శనివారం) ఉదయం 10గంటలకు ప్రారంభంకానున్నాయి. మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు చేయనున్నారు. పాతబస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరాలం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకుంటున్నారు. మరికొద్దిసేపట్లో సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. మీరాలం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారతదేశంలో రంజాన్ పండుగను శనివారం జరుపుకుంటున్నారు.

# సిద్దిపేటలో సరికొత్త శకం

జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి



సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేపు ఈ భారీ కర్మాగారం అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ శనివారం క్షేత్ర స్థాయిలో పర్యటించి ఏర్పాట్లను ముమ్మరంగా సమీక్షించారు.

## భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా మంత్రులు ముందుగా హెలిప్యాడ్‌ను పరిశీలించారు. భద్రతా పరమైన చర్యలపై పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఆ తర్వాత కర్మాగారం ప్రారంభోత్సవ ప్రాంగణం, భారీ బహిరంగ సభ కోసం సిద్ధం చేసిన స్థలాన్ని అడిగి తెలుసుకున్నారు. సభా ప్రాంగణం వద్దే ఏర్పాటు చేసిన 150 ప్రత్యేక స్టాళ్లను వారు నిశితంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న నూతన రిఫైనరీ ప్రదేశాన్ని కూడా వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు, అధికారులు పాలుపంచుకున్నారు.

## రైతులకు కల్పతరువు ఆయిల్ పామ్

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు తాను ప్రత్యేకంగా శ్రమించానని గుర్తు చేసుకున్నారు. ఈ పంట రైతుల పాలిట కల్పతరువు లాంటిదన్నారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా, కోతుల బెడద ఉన్నా ఈ పంటకు పెద్దగా నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు. ఉత్తర తెలంగాణ రైతాంగానికి ఈ ఫ్యాక్టరీ ఒక ప్రధాన కేంద్రంగా అవతరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులంతా సంప్రదాయ పంటల నుంచి లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కర్మాగారం గంటకు 30 నుంచి 180 టన్నుల వరకు క్రషింగ్ చేయగల భారీ సామర్థ్యం కలిగి ఉందని వివరించారు.

## 16 నెలల్లోనే పూర్తి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ రంగంలో ఈ కర్మాగారం ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తుందని అభివర్ణించారు. 32 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 300 కోట్ల రూపాయల భారీ వ్యయంతో దీనిని నిర్మించినట్లు వెల్లడించారు. కేవలం 16 నెలల రికార్డు వ్యవధిలోనే నిర్మాణం పూర్తి చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత అని ఆయన కొనియాడారు. రాజధాని హైదరాబాద్ మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. గతంలో రైతులు పండించిన పంటను ప్రాసెసింగ్ కోసం సుదూర ప్రాంతమైన అశ్వారావుపేటకు తరలించాల్సి వచ్చేదని, ఇకపై ఆ కష్టాలు తప్పుతాయని, ఇక్కడే పూర్తి స్థాయి ప్రాసెసింగ్ జరుగుతుందని భరోసా ఇచ్చారు.

## విద్యుత్ ఉత్పత్తి.. వెనువెంటనే చెల్లింపులు

ఈ ఫ్యాక్టరీలో కేవలం నూనె ఉత్పత్తి మాత్రమే కాకుండా, మిగిలిన వ్యర్థాలతో ఏకంగా 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా చేయనున్నట్లు మంత్రి తుమ్మల ప్రకటించారు. ఇక్కడే నూతనంగా రిఫైనరీని సైతం ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా తయారైన నాణ్యమైన వంట నూనెను నేరుగా 'విజయ' బ్రాండ్ పేరుతో వినియోగదారులకు అందిస్తామని ఆయన సంతోషంగా వెల్లడించారు. ఆయిల్ పామ్ గెలలు అమ్మిన కేవలం 3 రోజుల్లోనే రైతులకు రావాల్సిన డబ్బులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.

## దేశంలోనే అగ్రగామిగా..

దేశవ్యాప్తంగా ఆయిల్ పామ్ ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రులు ఇరువురు ఉద్ఘాటించారు. స్థిరమైన, నిరంతర ఆదాయాన్ని అందించే ఈ పంటను సాగు చేసేందుకు రైతులు పెద్ద ఎత్తున ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. రేపు జరగనున్న ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, రిఫైనరీ శంకుస్థాపన కార్యక్రమాలకు రైతాంగం, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# మొన్న భార్య .. నేడు భర్త ఆత్మహత్య

## కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం



కరీంనగర్,మార్చి21: కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు. చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం. ఈ క్రమంలో భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

## అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

రంగారెడ్డి,మార్చి21: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ క్షఖీఖీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ÷ాజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లేస్తున్నారు సిట్ అధికారులు.

# కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు

హైదరాబాద్,మార్చి21: హైదరాబాద్ లోని కుల్సుంపురా ప్రాంతంలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారు చేసి నగరంలోని ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అధికారులు అరెస్ట్ చేశారు. అబ్దుల్ అనే వ్యక్తి అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ముఖ్యంగా కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్ తయారు చేసి హోటళ్లకు పంపిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో పాడైన, నాసిరకం ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఊఈం÷ అధికారులు కేసు నమోదు చేసి అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో కుల్సుంపురా ప్రాంతంలో తయారవుతున్న ఫుడ్ ఐటమ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండలని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్న ఆహారం కనపడుతుంది. హైదరాబాద్ ఫుడ్ అడల్టేష్రన్ సర్వేలేన్స్ టీం, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కులసుంపుర పోలీస్ సమన్వయంతో ఈ దాడి చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా సమోసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. అతనికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ÷ర్ సేఫ్టీ క్లియరెన్స్ ఏదీ లేకపోవడం గమనార్హం. దర్యాప్తులో భాగంగా కుళ్లిపోయిన గుడ్లు, పలుమార్లు వాడిన వంటనూనె వంటి నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ యూనిట్‌లో అపరిశుభ్ర పరిస్థితుల్లో సమోసాలు, ఇతర ఫుడ్ ఐటమ్స్ తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దాడి సమయంలో సుమారు రూ.5 లక్షల విలువైన నాసిరకం ఆహార పదార్థాలు, ముడి సరుకులు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల సమోసాలు, మైదా, స్వీట్ కార్న్ వంటి ముడి పదార్థాలు కూడా ఉన్నాయి. నిందితుడు అబ్దుల్ రషీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసులు ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. హోటళ్లకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు

# గ్యాస్ కొరత నివారణకు కేంద్రం చర్యలు

## 20శాతం అదనపు కమర్షియల్ గ్యాస్ సరఫరా



న్యూఢిల్లీ,మార్చి21: వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతోపాటు వలస కూలీలకు ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు అందజేయాలని సూచించింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియంశాఖ కార్యదర్శి లేఖ రాశారు.

# శ్రమ మాది.. శిలాఫలకాలు మీవా?

- నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం
- కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం
- సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం
- ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్
- ప్రాంభోత్సవాలకు రావడం..రిబ్బన్ కట్ చేయడం మీ వంతా
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట,మార్చి21:** సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకుతెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మెట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్థాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్?కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600-1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. మన ప్రాంతంలో సన్‌ఫ్లవర్ కూడా బాగా సాగు చేస్తున్నారని.. దానికి కూడా ఈరోజు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని సూచించారు. సన్‌ఫ్లవర్ తక్కువ కాలంలో పూర్తయ్యే పంట.. దీనివల్ల అధిక ఆదాయంతో పాటు మంచి దిగుబడి కూడా వస్తుందని అన్నారు. పంట మార్పిడికి కూడా ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాబోయే రోజుల్లో దీన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశువులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోవడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు. వానలు పడినా, పడకపోయినా కాలంతో సంబంధం లేకుండా రైతులు రెండు పంటలు పండిస్తూ బంగారం లాంటి దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన మన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశర చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు

# ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు లేదు

- వాటికి చట్టబద్ధత కల్పించాలని ప్రైవేట్ బిల్లు పెడతాం
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,మార్చి21:** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. 840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బ్జడెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరఫున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు.ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఓట్లు రాబట్టడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల హామీల అమలు చట్టంపై సంతకం చేశారని ఉభయ సభల్లో గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన ప్రసంగంలో చెప్పారని ప్రస్తావించారు.

# నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో రైతు మేళా

- ఆధునిక సాంకేతికతతోనే అధిక దిగుబడులు
- రైతులను ఉత్సాహపరిచిన వంగ రాజేశ్వర్ రెడ్డి

జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి



నంగునూరు మండలం నర్మెట్టలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో రైతు మేళా ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ నాయకుడు వంగ రాజేశ్వర్ రెడ్డి హాజరై రైతుల్లో ఉత్సాహాన్ని నింపారు. వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన తన బృందంతో కలిసి సందర్శించారు.

## నూతన సాగు విధానాలపై అవగాహన

వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రైతులు గమనించాలని రాజేశ్వర్ రెడ్డి సూచించారు. స్టాళ్లలో ప్రదర్శించిన ఆధునిక వ్యవసాయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల పెంపకం విధానాల గురించి ఆయన ఆరా తీశారు. ఇలాంటి మేళాలు నూతన సాంకేతికతను రైతులకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక యంత్రాలు, కొత్త పంటల నమూనాలు, లైవ్ స్టాక్ ప్రదర్శనలు రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తాయని వివరించారు.

## దిగుబడులు పెంచుకోవాలని పిలుపు

రైతులు ఈ మేళాలను సద్వినియోగం చేసుకుని కొత్త పద్ధతులు నేర్చుకోవాలని రాజేశ్వర్ రెడ్డి కోరారు. తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. వ్యవసాయ నిపుణులు, ప్రభుత్వ శాఖలు సమగ్ర సమాచారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమకు అవసరమైన సమాచారాన్ని, పరికరాల వివరాలను సేకరించారు. కార్యక్రమం మొత్తం సందడిగా, ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# మారుతున్న యుద్ధరీతులు

**యువత దేశ రక్షణకు నడుం బిగించాలి**

**కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్**



**న్యూఢిల్లీ, మార్చి 21:** నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

# ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

**డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం**

**రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలు: రాహుల్**



**న్యూఢిల్లీ, మార్చి 21:** పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాం కాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకే తాలు అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభా వం చూపుతాయన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవు తాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరుగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదని అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశర కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్ళెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# మియాపూర్‌లో దారుణ ఘటన

**తను కోరుకున్న యువతి మరొకరితో పెళ్లి**

**కోపంతో యువతిపై కత్తితో దాడి**


**హైదరాబాద్,మార్చి21:** మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనని కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో మహిళ ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం అనే మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. ప్రస్తుతం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. స్థానికంగా హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంత కాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయింది. ఇద్దరూ ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెళ్లి ఆలీషా అలియాస్ పాండు అనే యువకుడికి నచ్చలేదు. నూకరత్నం హౌస్ కీపింగ్ చేస్తున్న చోట పాండు వంటవాడిగా పని చేస్తున్నాడు. అతడు నూకరత్నంను ఇష్టపడ్డాడు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాడు. ఇంతలోనే నూకరత్నం.. ప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. దీంతో పాండు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19వ తేదీన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. ఆమెను తనతో పాటు రమ్మని అడిగాడు. ఇందుకు నూకరత్నం ఒప్పుకోలేదు. మె తన మాట వినకపోవటంతో పాండు ఆగ్రహానికి గురయ్యాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. పాండు కత్తి దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఆమెను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడ్డ పాండుతో పాటు అతడి తండ్రి లాలూను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.




సంపాదకీయం

# రుణ విముక్తి చర్యలను పట్టించుకోని బడ్జెట్

దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏం గొప్ప పనులు చేశారంటే ఏమీ లేదు. ఉన్న అప్పులకు మిత్తీలు కట్టడం, కొత్తగా అప్పులు తేవడం తప్ప, తెలంగాణను రుణం నుంచి విముక్తి చేసే ఆలోచన ఒక్కటీ కానరాలేదు. కెసిఆర్‌ను మించి అప్పులు చేస్తూ పోతే మరో వంద ఏళ్లయినా అప్పులు తీరవు. దీనిపై ఆలోచన, ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రసంగాలు సాగుతున్నాయి. మేము ఎంచుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నాం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగాం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును, తిరిగి వారి అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం ఆర్థిక మంత్రిగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క గొప్పగా చెప్పుకున్నారు. కానీ డబ్బు ఆదా చేయడం, వృధా చేయకుండా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎక్కడా ప్రస్తావించలేదు. ఎక్కడ వృధా అవుతుందో కూడా గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. గ్రామాలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించే ప్రయత్నం జరగడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలకు డబుల్ పెన్షన్లు, లక్షల్లో జీతాలు ఎందుకో చెప్పడం లేదు. కిలో రూపాయి బియ్యం వృధాను అరికట్టడం లేదు. పెన్షన్ల వృధాను గుర్తించడం లేదు. ఇవన్నీ కట్టడి చేస్తే కొంతయినా మిగులుబాటు ఉంటుంది. ఇకపోతే కేవలం సంక్షేమం తప్ప అభివృద్ధి జరగడం లేదు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా, వాటిని పట్టించుకోవడం లేదు. వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చిన ఘనత వీరిది. వేల ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతం అయి, దేవాలయాలు పాడుబడ్డా పట్టింపు లేదు. ఉత్సవాలు నిర్వహించుకోవడం తప్ప దేవాదాయశాఖ మంత్రికి ఏ భూమి ఎక్కడ ఉందో లేదో తెలియదు. రోడ్లు ఎలా ఉన్నాయో రోడ్లు భవనాల శాఖ మంత్రికి తెలియదు. ప్రభుత్వమంటే పంచి పెట్టడం కాదు. ఆదాయాన్ని ఆదా చేయాలి. అప్పులు లేకుండా చేయాలి. అలా కాకుండా సంక్షేమాల పేరుతో దుబారా చేయడం వల్ల అభివృద్ధి ఆగిపోతోంది. తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఇది కేవలం రేషన్ కార్డులు ఉన్నవారికే అని చెప్పకనే చెప్పారు. రేషన్ కార్డుల్లో బోగస్ ఎత్తివేస్తే అనేకమంది పేదలకు లబ్ది చేకూరుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇది ఎవరికన్నది స్పష్టత లేదు. అన్ని కుటుంబాలకు వర్తిస్తుందా అన్నది చెప్పాలి. ఇకపోతే ఆసుపత్రులు కునారిల్లుతున్నాయి. వాటిని పటిష్టం చేయాల్సి ఉన్నా గత రెండేళ్లుగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. హాస్టళ్లునరక కూపాలుగా ఉన్నా వాటిని ఉద్దరించలేదు. ఉన్న స్కూళ్లను సంస్కరించడం లేదు. కానీ కొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలన్న లక్ష్యం మంచిదే. కానీ ఉన్న స్కూళ్లను బాగుచేసి, అధ్యాపకులను భర్తీ చేస్తే మంచిది. ఇకపోతే మూసీ కాలుష్యం నుంచి రాజధానివాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పం ఆహ్వానించదగ్గదే. గత బడ్జెట్ అంచనాలకన్నా అదనంగా పెంచిన రూ.43 వేల కోట్ల బడ్జెట్ ఆదాయ అంచనాలలో ఏ పద్దు కింద ఎంత పెరుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వం ఉజ్జాయింపుగా తెలిపింది. పన్నులద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,710 కోట్లు, కొత్త రుణాలు రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది. ఈ అంచనాల ప్రకారమే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పెంచింది. కానీ ఆదాయం అదనంగా పెరుగుతుందని పెట్టుకున్న లక్ష్యాల్లో అన్నీ నెరవేరతాయా అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు వచ్చే ఏడాది అదనంగా రూ.13 వేల కోట్లు పెరుగుతాయని తెలిపింది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పద్దు కింద కేంద్రం నుంచి బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనా ప్రకారం నిధులు రాలేదు. కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని గత బడ్జెట్‌లో అంచనా వేస్తే రూ.11,161 కోట్లే వచ్చినట్లు సవరణ పద్దు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీల చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులతో పోతున్నందున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా తీసుకునే రుణాలే కీలకంగా మారనున్నాయి. ప్రస్తుత ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.67,539 కోట్లను సేకరించారు. ఇక వచ్చే ఏడాదికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్లు, ఇతర మార్గాల్లో మరికొన్నికలిపి మొత్తం రూ.82,870 కోట్ల కొత్త రుణాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్న తరుణంలో అందుకు అనుగుణంగా కూడా ఆలోచన చేయకపోవడం గమనార్హం. ఎప్పటికైనా ఉచిత పథకాలు తగ్గించుకోవడం, ఖర్చులు తగ్గించుకోవడం చేయనంత వరకు బడ్జెట్ కేటాయింపులు ఘనంగానే ఉంటాయి. ఆయరణలో దెబంతింటాయి.



# తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

- దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్
- హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం



**టెహ్రాన్, మార్చి 21:** రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టా÷–గ్గ÷ట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్–2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్–యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళుతున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల వేళ.. ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది.

# యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత



**వాషింగ్టన్, మార్చి 21:** యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణ ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితి పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

# దాడులతో దద్దరిల్లుతో పశ్చిమాసియా

**ఇరాన్ అణు కేంద్రంపై వైమానిక దాడులు**

**నష్టం లేదని తెలిపిన ఇరాన్**

**అంతర్జాతీయ ఉల్లంఘనేనని ఆరోపణ**

**టెహ్రాన్, మార్చి 21:** దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. తాజాగా ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు పాల్పడినట్టు స్థానిక మీడియా సంస్థ తస్నిమ్ తెలిపింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత నతాంజ్ అణు క్షేత్రంపై దాడులు చేయడం ఇది రెండోసారి. నతాంజ్ అణు క్షేత్రంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడ్డాయని, అయితే రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యా లేదని తెలిపింది నతాంజ్ క్షేత్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే .తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. నెతన్యాహు ప్రకటించిన కొద్ది గంటల్లోనే నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరగడం గమనార్హం. నతాంజ్ అణు కేంద్రం టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# యూఎన్ఐ న్యూస్ ఏజెన్సీ ఆఫీసు సీజ్

**50 మంది జర్నలిస్టుల గెంటివేత**

**హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం**



**న్యూఢిల్లీ, మార్చి 21:** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ యుఎన్ఐ ఆఫీసును శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యూఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. 1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యూఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

# బస్వాపూర్‌లో రంజాన్ వేడుకలు

## ముస్లిం సోదరులకు గ్రామస్థుల ఈద్ ముబారక్

## శాంతి, సామరస్యాలకు ప్రతీకగా పండుగ



**కోహెడ (బస్వాపూర్), మార్చి 21 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు గ్రామ ప్రజలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. నెలవంక దర్శనంతో పవిత్ర ఉపవాస దీక్షలు (రోజా) ముగిశాయి. శనివారం ఉదయం ముస్లింలు మసీదుల్లో సామూహిక నమాజ్ నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' చెప్పుకున్నారు. రంజాన్ పండుగ శాంతి, క్రమశిక్షణ, సామాజిక సమానత్వానికి నిదర్శనమని గ్రామస్తులు కొనియాడారు. ఈ పవిత్ర పర్వదినాన 'ఫిత్రా' పేరుతో పేదలకు దానధర్మాలు చేశారు. పండుగ సంతోషాన్ని అందరితో పంచుకోవాలనే ఉద్దేశంతో నిరుపేదలకు సాయం అందించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆనందంగా గడుపుతూ పండుగ వేడుకలను జరుపుకున్నారు. బస్వాపూర్ గ్రామంలో నెలకొన్న ఈ సామరస్య వాతావరణం అందరినీ ఆకట్టుకుంది.

# జన్నారం బీజేపీలో కొత్త జోష్

## కడెం శిక్షణా తరగతులకు భారీగా తరలివెళ్లిన కాషాయ దళం



**తుడుం జితేందర్ -జనం పవర్**
**ఉత్తర తెలంగాణ బ్యూరో**

పార్టీని క్షేత్రస్థాయిలో ఉక్కు కవచంలా తీర్చిదిద్దేందుకు జన్నారం బీజేపీ శ్రేణులు నడుం బిగించాయి. కడెంలో జరుగుతున్న పార్టీ శిక్షణా తరగతులకు శనివారం జన్నారం మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు సారథ్యంలో కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. గ్రామగ్రామాన పార్టీని ఒక తిరుగులేని శక్తిగా మార్చడమే లక్ష్యంగా ఈ శిక్షణా కార్యక్రమం కొనసాగుతోంది. కార్యకర్తలు కేవలం సభ్యులుగా మాత్రమే కాకుండా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అస్త్రాలుగా మారాలని మధుసూదన్ రావు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అయితేనే ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాడగలమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త ఒక నాయకుడిలా ఎదగాలని, ప్రజాప్రతినిధులు ఈ తరగతులను ఆయుధంగా మలుచుకుని జనంలోకి వెళ్లాలని కోరారు. రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడానికి ఈ తరగతులు వేదికగా మారాయి. జన్నారం నుండి వెళ్లిన భారీ కాన్వాయ్ మండలంలో పార్టీకున్న పట్టును చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఘనంగా గౌడ ప్రజాప్రతినిధులు, జర్నలిస్టుల సన్మానం

- జన్నారంలో ఉట్టిపడ్డ కుల ఐక్యత
- సర్వాయి పాపన్న ఆశయ సాధనే లక్ష్యం



**తుడుం జితేందర్ -జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం గడ్డపై గౌడన్నల ఐక్యత ఉట్టిపడింది. రాజకీయాల్లో రాణిస్తున్న స్వకులం బిడ్డలను, కలం పట్టిన యోధులను ఒకే వేదికపైకి తెచ్చి పొనకల్ గౌడ సంఘం గౌరవించుకుంది. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ హాల్ వేదికగా జరిగిన ఈ 'ఆత్మీయ సన్మాన సభ' ఎంతో ఉత్సాహభరితంగా సాగింది.

### ప్రతిభావంతులకు ఆత్మీయ సత్కారం

ఈ వేదికపై ప్రజల తీర్పుతో గెలిచిన వారసులను, పత్రికా రంగంలో ఎదిగిన ప్రతిభావంతులను ఘనంగా సత్కరించారు. చింతలపల్లె సర్పంచ్ పంజాల సురేష్ గౌడ్, జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్, ఉపాధ్యక్షుడు అమరగొండ సతీష్ గౌడ్ తో పాటు వివిధ వార్డుల సభ్యులు పోడేటి మల్లేష్ గౌడ్, నాయిని రమేష్ గౌడ్, బుర్రగడ్డ జగన్ గౌడ్, నాయిని భూమా గౌడ్ లను సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

### పాపన్న స్ఫూర్తితో ముందడుగు

ముఖ్య అతిథులుగా విచ్చేసిన మొకుదెబ్బ జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, ఎన్నారై సెల్ అంతర్జాతీయ అధ్యక్షులు ఎరుకల రాజుగౌడ్ మాట్లాడుతూ.. బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలకు ఇలాంటి సభలే నిదర్శనమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, పత్రికా రంగంలో ఉన్నా మన వారు కుల గౌరవాన్ని చాటాలని హితవు పలికారు. పదవులు బాధ్యతలను పెంచుతాయని, నిరంతరం ప్రజల మనిషిగా ఎదగాలని వారు కోరారు.

### విజయవంతమైన సభ

సంఘం అధ్యక్షుడు పోడేటి సతీష్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మండల అధ్యక్షులు మూల భాస్కర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు వోల్లాల నర్సాగౌడ్ తో పాటు యువ నాయకులు రాసమల్ల ప్రశాంత్ గౌడ్, గర్రెపల్లి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 20 ఏళ్లుగా నీటి సేవ.. సురేందర్ రెడ్డి కుటుంబం ఆదర్శం

## రంజాన్ వేళ మత సామరస్యం.. మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుసేన్ ప్రశంసలు

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

రంజాన్ పర్వదినం సందర్భంగా సిద్దిపేటలో మత సామరస్యాన్ని ప్రతిబింబించే ఒక హృద్యమైన సంఘటన అందరి మనసులను హత్తుకుంటోంది. గత 20 ఏళ్లుగా ముస్లిం సోదరులు కబ్రిస్తాన్‌కు వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో వారికి చల్లని తాగునీటిని అందిస్తూ మాజీ కౌన్సిలర్ సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం నిరంతరంగా కొనసాగుతున్న ఈ సేవ స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది. కులమతాలకు అతీతంగా సాగుతున్న ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. "మానవత్వమే మతం" అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తున్న సురేందర్ రెడ్డి కుటుంబం ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. ఈ సేవను గుర్తిస్తూ మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుసేన్ సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన కొనియాడారు. మత భేదాలను పక్కన పెట్టి అందరూ కలిసి సోదరభావంతో ముందుకు సాగాలని ఫారుక్ హుసేన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని సురేందర్ రెడ్డి కుటుంబాన్ని అభినందించారు. ముస్లిం సోదరులు కూడా ఈ సేవకు కృతజ్ఞతలు తెలుపుతూ ఇలాంటి మానవతా కార్యక్రమాలు మరిన్ని జరగాలని కోరుకున్నారు. ప్రతి ఏటా రంజాన్ వేళ జరుగుతున్న ఈ కార్యక్రమం గ్రామంలో శాంతిని, సామరస్యాన్ని పెంచుతూ మత సామరస్యానికి చిరస్మరణీయ ఉదాహరణగా నిలుస్తోంది.



# సదాశివపేటలో రంజాన్ సందడి.. ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే

## ముస్లిం సోదరులకు చింత ప్రభాకర్ శుభాకాంక్షలు

## సోదరభావానికి రంజాన్ పండుగ నిదర్శనం





**సంగారెడ్డి, మార్చి 21 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో రంజాన్ పండుగ వేళ ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. పవిత్రమైన ఈ పండుగ సందర్భంగా ముస్లిం సోదరుల ఇళ్లకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్వయంగా వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా పలకరించారు. ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేసుకున్న ముస్లిం సోదరులను ఎమ్మెల్యే అభినందించారు. రంజాన్ పండుగ సోదరభావం, సహనం, పరస్పర గౌరవానికి గొప్ప ప్రతీక అని ఆయన కొనియాడారు. సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరిసేలా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. పండుగలు మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి ప్రేమానురాగాలను పెంచుతాయని పేర్కొన్నారు. తమ ఇళ్లకు వచ్చి పలకరించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పట్ల ముస్లిం మత పెద్దలు సంతోషం వ్యక్తం చేశారు. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. సదాశివపేటలో జరిగిన ఈ వేడుకలు సర్వమత సామరస్యానికి అద్దం పట్టాయి.

### ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను కండువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానికులతో ఆయన ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, చింత సాయినాథ్, గోవర్ధన్ నాయక్ పాల్గొన్నారు. శ్రీధర్ రెడ్డి, నాగేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు వేడుకల్లో భాగమయ్యారు.

# జమ్మికుంటలో మిన్నంటిన రంజాన్ సంబరాలు

## ఈద్గా మైదానాల్లో సామూహిక నమాజ్‌లు

## భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు



**జమ్మికుంట, మార్చి 21 (జనం పవర్):**

జమ్మికుంట పట్టణం తో పాటు బిజిగీర్ షరీఫ్ గ్రామంలో రంజాన్ పండుగ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆత్మపరిశుద్ధి, దానధర్మాలు, సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను వందలాది మంది ముస్లింలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు (రోజాలు) పాటించిన భక్తులు.. శుక్రవారం రాత్రి నెలవంక దర్శనంతో పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ముస్లిం సోదరులు స్థానిక ఈద్గా మైదానాలకు చేరుకున్నారు. అక్కడ సామూహిక నమాజ్ నిర్వహించి లోక కల్యాణం కోసం ప్రార్థించారు. మత గురువు మౌలానా మొహమ్మద్ నౌమాన్ హష్మీ ఖురాన్ సూక్తులను చదివి వినిపించి అల్లాహ్ ఆదేశాలను వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' చెప్పుకున్నారు. దానగుణానికి నిదర్శనంగా పేదలకు 'ఫిత్రా' రూపంలో వస్త్రదానంతో పాటు నగదును అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. పండుగ వేళ పిల్లల సందడి ప్రత్యేకంగా నిలిచింది. పెద్దల నుంచి 'ఈదీ' (నగదు బహుమతులు) అందుకుంటూ వారు ఆనందంగా గడిపారు. ఇంట్లో తయారు చేసిన తీపి వంటకం 'షిర్ ఖుర్మా'ను మిత్రులకు, ఇరుగుపొరుగు వారికి పంచి ఆత్మీయతను పంచుకున్నారు. ఇతర మతాలకు చెందిన వారు కూడా ముస్లిం మిత్రులకు శుభాకాంక్షలు తెలిపి మత సామరస్యాన్ని చాటారు. బిజిగిర్ షరీఫ్ 9వ వార్డు సభ్యుడిగా ఇటీవల ఎన్నికైన మొహమ్మద్ నయీముద్దీన్ ను ఈద్గా వద్ద శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండలం మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అంకుషావలి, సయ్యద్ సమీర్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు. వీరితో పాటు దర్గా కమిటీ ప్రతినిధులు తౌఫీక్ హుస్సేన్, జమాల్ అష్రఫ్, అహమ్మద్, లతీఫ్ హుస్సేన్, జలీల్ తదితరులు పాల్గొని వేడుకలను జయప్రదం చేశారు.

# శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రైతులకు మద్దతు ధర భరోసా**

**జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**



**జుక్కల్, మార్చి 21 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా మద్నూర్, డోంగ్లి మండల కేంద్రాల్లో శనగల కొనుగోలు కేంద్రాలను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మద్దతు ధరతో పంటను సేకరిస్తోందని తెలిపారు. రైతులందరూ దళారులను నమ్మి మోసపోకుండా తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎమ్మెల్యే సూచించారు. సరైన ధర పొంది ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన కోరారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.

# మైనారిటీల అభివృద్ధే లక్ష్యం

**మాజీ ఎంపీపీ చిలుక రవీందర్**

**రుక్మాపూర్ ఈద్గాలో ఘనంగా రంజాన్ వేడుకలు**



**చొప్పదండి, మార్చి 21 (జనం పవర్):**

చొప్పదండి మండలం రుక్మాపూర్ ఈద్గా ప్రాంగణంలో రంజాన్ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో తాజా మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ పాల్గొని ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ త్యాగం, నియమం, సేవాభావానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మైనారిటీల అభివృద్ధి లేకుండా సమాజ ప్రగతి సాధ్యం కాదని రవీందర్ స్పష్టం చేశారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ముస్లిం సోదరులు కనీస సౌకర్యాలకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. తాను పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. రుక్మాపూర్, కాట్నపల్లి, చాకొంట గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తానని రవీందర్ భరోసా ఇచ్చారు. ప్రతి ఇంటికి తాగునీరు, మెరుగైన రోడ్లు, విద్యా సదుపాయాలు అందే వరకు తన పోరాటం కొనసాగుతుందన్నారు. మత సామరస్యం దెబ్బతినేలా చేసే శక్తులను ఖండించాలని, ఐక్యతతోనే దేశం బలోపేతం అవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# చెన్నూర్‌లో అభివృద్ధి పనులకు మంత్రి వివేక్ శంకుస్థాపన

**కుమ్మరికుంట సుందరీకరణకు రూ. 1.87 కోట్ల నిధులు**

**మంచినీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ**



**ఏల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో అమృత్ 2.0 పథకం ద్వారా రూ. కోటి 87 లక్షల నిధులతో కుమ్మరికుంట పునర్జీవ, అభివృద్ధి పనులకు కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం శంకుస్థాపన చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. చెన్నూరు నియోజకవర్గ ప్రజల మంచినీటి కష్టాలను శాశ్వతంగా తొలగించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

**రూ. 100 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు**

నియోజకవర్గంలో తాగునీటి సౌకర్యం కోసం అమృత్ స్కీమ్ కింద రూ. 100 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. గోదావరి నది నుంచి లింక్ కనెక్టివిటీ ద్వారా నీటిని తరలించేందుకు మరో రూ. 45 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నిధులు కోరామని, త్వరలో చెన్నూరులో మంచినీటి కొరత అనేదే ఉండదని భరోసా ఇచ్చారు. మిషన్ భగీరథ ఒక ఫెయిల్యూర్ ప్రాజెక్టు అని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు.

**టూరిజం సెంటర్‌గా కుమ్మరికుంట**

రూ. కోటి 87 లక్షలతో కుమ్మరికుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన టూరిజం సెంటర్ గా మార్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భార్య వెంటే ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం

- **అనాథలైన పసిపాపలు.. సీతంపేటలో విషాదం**

**తుడుం జితేందర్ -జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**





విధి ఆడిన వింత నాటకంలో ఒక అందమైన కుటుంబం చిన్నాభిన్నమైంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ తీసుకున్న ఆవేశపూరిత నిర్ణయం ఆ కుటుంబాన్ని చీకట్లోకి నెట్టేసింది. కొద్దిరోజుల క్రితమే ఆయన భార్య దివ్య బలవన్మరణానికి పాల్పడటంతో చంద్రశేఖర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. భార్యను కోల్పోయిన బాధకు తోడు ఆమె మరణంపై వెల్లువెత్తిన ఆరోపణలు ఆయనను మానసిక కుంగుబాటుకు గురిచేశాయి.

**అవమానాల మధ్య ఆవేదన**

దివ్య అంత్యక్రియల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు ఎస్సైని మరింత కుంగదీశాయి. ఆమె మృతికి ఆయనే కారణమంటూ గ్రామస్థులు దాడికి ప్రయత్నించడం.. ఆ సమయంలో దివ్య తండ్రి అడ్డుపడి పరిస్థితిని అదుపులోకి తేవడం వంటి ఘటనలు ఆయనను ఆవేదనకు గురిచేశాయి. ఆత్మగౌరవంతో బతికే ఒక పోలీసు అధికారిగా సమాజం వేలెత్తి చూపుతుంటే తట్టుకోలేకపోయారు. భార్య జ్ఞాపకాలు వెంటాడుతుండటంతో ఇల్లందకుంట మండలం సీతంపేటలోని తన అత్తగారింటికి వెళ్లిన చంద్రశేఖర్ అక్కడే ఉరివేసుకుని ప్రాణాలు విడిచారు.

**చిన్నబోయిన చిన్నారుల లోకం**

ఈ కథనంలో అత్యంత విషాదకరమైన అంశం ఆ దంపతులకున్న ఇద్దరు చిన్నారులు. అమ్మానాన్నల మధ్య గొడవలేంటో తెలియని ఆ పసివాళ్లకు ఇప్పుడు తండ్రి తోడు లేదు.. తల్లి ప్రేమ లేదు. పోలీసు యూనిఫాంలో హుందాగా కనిపించే నాన్న.. గోరుముద్దలు తినిపించే అమ్మ ఇద్దరూ దూరం కావడంతో ఆ చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. రక్షణ కల్పించాల్సిన చేతులే విధికి లొంగిపోవడంతో ఆ చిన్నారులు ఇప్పుడు కన్నీరే తోడుగా అనాథలయ్యారు.

# పత్తి చేనులో పసికందు.. ప్రాణం పోసిన రైతన్నలు

- **మండుటెండలో విలవిలలాడిన చిన్నారి**
- **సీతానగర్ శివారులో సభ్యసమాజం తలదించుకునే ఘటన**

**తుడుం జితేందర్ -జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**



ఎండలు మండుతున్న వేళ.. పత్తి చేనులో ఓ చిన్నారి ప్రాణం విలవిలలాడింది. మనిషి కనికరం కరువై, అప్పుడే పుట్టిన పసికందు అనాథలా పడి ఉంది. కొమరం భీం జిల్లా సీతానగర్ శివారులో శనివారం వెలుగుచూసిన ఈ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా చేసింది. వల్లగొండ గ్రామపంచాయతీ పరిధిలోని పొలాల్లో పనుల కోసం వెళ్లిన రైతులకు పత్తి చేను మధ్యలో ఓ పాత గుడ్డలో చుట్టి ఉన్న మూట కనిపించింది. మొదట ఏదో పారేశారని భావించినా దగ్గరకు వెళ్ళాక వినిపించిన సన్నని ఏడుపు వారిని ఉలిక్కిపడేలా చేసింది. ఆ మూట విప్పి చూడగా లోకానికి ఇంకా కళ్లు కూడా సరిగ్గా విప్పని పసికందు కనిపించింది. వెంటనే మానవత్వంతో స్పందించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి శిశువును సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటన వెనుక అవమాన భారం ఉందా? లేక పేదరికంతో పెంచలేక రోడ్డున పడేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పసిగుడ్డును గాలికి వదిలేసి వెళ్ళిన ఆ కఠిన హృదయాలెవరో తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమీప గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, ఇటీవల ప్రసవించిన వారి వివరాలను సేకరిస్తున్నారు.

**నిందితుల కోసం గాలింపు**

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల రికార్డులను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. పసికందును ప్రాణాపాయంలోకి నెట్టిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిడ్డను పెంచలేని పరిస్థితి ఉంటే శిశు సంక్షేమ శాఖకు అప్పగించాలి కానీ ఇలా ప్రాణాలతో చెలగాటం ఆడటం అమానుషమని పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ చిన్నారి ప్రభుత్వ సంరక్షణలో క్షేమంగా ఉంది. మట్టిలో పడి ఉన్న మాణిక్యాన్ని దేవుడే కాపాడాడని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

# నవోదయ ఫలితాల్లో విజ్ఞాన్ సూపర్ 30 ప్రభంజనం

- **తొలి ఏడాదిలోనే విద్యార్థుల ఘన విజయం**
- **విజేతలను సన్మానించిన పొనకల్ సర్పంచ్**

**తుడుం జితేందర్ -జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**




జన్నారంలోని విజ్ఞాన్ సూపర్ 30 క్యాంపస్ అద్భుత ఫలితాలతో సత్తా చాటింది. 2026-27 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో ఈ సంస్థ విద్యార్థులు ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. అంకితభావంతో కూడిన శిక్షణ ఉంటే గ్రామీణ విద్యార్థులు ఏదైనా సాధించగలరని ఈ సంస్థ నిరూపించింది. ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని శనివారం సంస్థ ఆవరణలో విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు పొనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను, వారికి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులను ఆమె శాలువాలతో ఘనంగా సన్మానించారు. తొలి ప్రయత్నంలోనే ఇలాంటి భారీ విజయాన్ని నమోదు చేయడం సంస్థ పట్టుదలకు నిదర్శనమని ఆమె కొనియాడారు. జన్నారం ప్రాంత విద్యా వికాసానికి డైరెక్టర్ రంజిత్ చేస్తున్న కృషి అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు.

సంస్థ డైరెక్టర్ రంజిత్ మాట్లాడుతూ విద్యార్థుల విజయమే తనకు అసలైన బహుమతి అని ఉద్వేగంగా చెప్పారు. కేవలం ర్యాంకుల కోసమే కాకుండా పిల్లల్లో జ్ఞానాన్ని నింపడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మొదటి సంవత్సరంలోనే ఆశించిన ఫలితాలు రావడం బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో జన్నారం నుండి మరిన్ని మేధావులను తయారు చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు విజ్ఞాన్ సూపర్ 30 బలమైన పునాది వేసిందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. రంజిత్ అందించిన నాణ్యమైన శిక్షణ, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ ఘనత సాధ్యమైందని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# జహీరాబాద్‌లో రంజాన్ సంబరాలు

- **ముస్లిం సోదరులకు మాజీ మంత్రి చంద్రశేఖర్ శుభాకాంక్షలు**
- **ఈద్గా వద్ద వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు**



**జహీరాబాద్, మార్చి 21 (జనం పవర్):**

జహీరాబాద్ పట్టణంలో రంజాన్ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పవిత్రమైన ఈ పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, జహీరాబాద్ ఇన్ ఛార్జ్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ ముస్లిం సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల అనంతరం వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ మన అందరిలో సోదరభావాన్ని పెంపొందించి కొత్త ఉత్సాహాన్ని నింపాలని డాక్టర్ చంద్రశేఖర్ ఆకాంక్షించారు. అల్లాహ్ ఆశీస్సులు జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పండుగలు మనుషుల మధ్య అనుబంధాలను బలపరుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, జహీరాబాద్ మున్సిపల్ ఛైర్మన్ యూనుస్ పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ నాయకులు హుగ్గేల్లి రాములన్న, ఇతర ముఖ్య నేతలు ఈ పండుగ సంబరాల్లో భాగమయ్యారు. ముస్లిం సోదరులు నేతలను సాదరంగా ఆహ్వానించి పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు.

# బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాల దహనం
- 15 శాతం నిధుల హామీ ఏమైందని నిలదీత



**కరీంనగర్, మార్చి 21 (జనం పవర్):**
విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిధులే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతా భవన్ చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఈ సందర్భంగా ఆయన తూర్పారబట్టారు.

## హామీలు విస్మరించిన ప్రభుత్వం

ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్.. బడ్జెట్‌లో కేవలం 8.22 శాతం నిధులతోనే సరిపెట్టడం దారుణమని రమేష్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వం కేవలం 4,343 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని దుయ్యబట్టారు. ఉస్మానియా, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయాలకు నిధులు ఇచ్చి ఇతర వర్సిటీలను విస్మరించడం తగదన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు 5 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఇప్పటికే ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, కస్తూరిబా పాఠశాలల పరిస్థితిని గాలికొదిలేసిందని విమర్శించారు.

## పోరాటాలకు సిద్ధం

తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ బడ్జెట్ విద్యాభివృద్ధికి కాదు.. విద్యా దారిద్ర్యానికి దారితీసేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నునావత్ శ్రీనివాస్ నాయక్, నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి బోయిని విష్ణువర్ధన్, నాయకులు సంపత్, సాయి కృష్ణ, అశోక్, అభి పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో విద్యకు అరకొర నిధులే

## 15 శాతం కేటాయింపుల హామీ ఏమైంది?

## ఎస్టీయూ నేత సాన కిషన్ విమర్శ

**కరీంనగర్, మార్చి 21 (జనం పవర్):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడాన్ని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సాన కిషన్ తప్పుబట్టారు. ఈ మేరకు శనివారం కరీంనగర్‌లో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం.. 2026-2027 సంవత్సరానికి కేవలం 8.22 శాతం నిధులే కేటాయించడం శోచనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా కనీసం 15 శాతం నిధులైనా కేటాయించి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంత తక్కువ నిధులతో ప్రభుత్వం అనుకున్న విద్యా లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదని సాన కిషన్ స్పష్టం చేశారు. అయితే ఉపాధ్యాయులు.. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్ కార్డులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల వేలాది మంది సిబ్బందికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలు.. కళాశాలల్లో విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అల్పాహార పథకం మంచి నిర్ణయమని కిషన్ కొనియాడారు. కానీ ఈ పథకం విజయవంతం కావాలంటే పాఠశాలల్లో దానికి కావాల్సిన ఏర్పాట్లు.. మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. సరైన వసతులు లేకుంటే పథకం అమలులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# గల్ఫ్ కార్మికులకు బడ్జెట్ మొండిచేయి

- బోర్డు ఊసేలేదు.. నిధుల జాడే లేదు
- మాట తప్పిన సర్కార్‌పై సంక్షేమ సమితి ఆగ్రహం



**తుడుం జితేందర్ -జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**
తెలంగాణ గల్ఫ్ కార్మికుల ఆశలపై రాష్ట్ర బడ్జెట్ నీళ్లు చల్లింది. తాజా బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంపై తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కార్యవర్గాలు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను తప్పుబట్టాయి.

## ముఖ్యమంత్రి మాట తప్పారు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసమేనా అని సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య, జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి నిలదీశారు. 2024 ఏప్రిల్ 16న స్వయంగా ముఖ్యమంత్రి గల్ఫ్ సంఘాల నేతలతో సమావేశమై.. ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను బడ్జెట్‌లో విస్మరించడం గల్ఫ్ కుటుంబాలను దగా చేయడమేనని మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినా.. అది ఇంకా అందరికీ అందలేదని నేతలు గుర్తు చేశారు. వేలాది మంది కార్మికుల సమస్యల పరిష్కారానికి నిధులతో కూడిన బోర్డు ఏర్పాటు అత్యవసరమని.. బడ్జెట్‌లో దీనికి చోటు దక్కకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఉద్యమానికి సిద్ధం

డిమాండ్లను ప్రభుత్వం గాలికొదిలేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని సంక్షేమ సమితి హెచ్చరించింది. వెంటనే బడ్జెట్ నిర్ణయాలను పునఃపరిశీలించి గల్ఫ్ కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని గల్ఫ్ సంఘాలను ఏకం చేసి.. జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షులు కొండూరు ప్రశాంత్, జన్నారం టౌన్ అధ్యక్షులు తాళ్లపల్లి రాజేష్, టౌన్ క్యాషియర్ మరిపెల్లి అంజయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని తమ గళాన్ని వినిపించారు.

# రాష్ట్ర ప్రగతికి దిక్సూచిగా బడ్జెట్

## విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు

## హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్

**జమ్మికుంట, మార్చి 21 (జనం పవర్):**



శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పదేళ్ల విధ్వంసం తర్వాత వికాసాన్ని కలిగించేలా ఉందని హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కొనియాడారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా కేటాయింపులు ఉన్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉపాధి, మౌలిక సదుపాయాలతో పాటు ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసేలా బడ్జెట్ రూపొందించారని ప్రణవ్ పేర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబ జీవిత బీమా పథకం పేద, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికీ సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని.. ఈ నెల 22 (ఆదివారం) నుంచి రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రణవ్ వెల్లడించారు. రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రగతికి ఈ బడ్జెట్ ఒక దిక్సూచిలా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బకాయిల ఊసేలేని బడ్జెట్

## రెండేళ్లుగా అందని గ్రాట్యుటీ, డీఏ నిధులు

## తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఫైనాన్స్ సెక్రెటరీ పొలాస రామచంద్రం

## ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్

**కరీంనగర్, మార్చి 21 (జనం పవర్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పదవీ విరమణ పొందిన ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఫైనాన్స్ సెక్రెటరీ పొలాస రామచంద్రం ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 2024 నుండి ఇప్పటివరకు రిటైర్ అయిన వారికి రావాల్సిన బకాయిల కోసం కనీస నిధులు కేటాయించకపోవడం దారుణమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రెండేళ్లుగా నిలిచిన నిధులు



పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్ (సీవీపీ), జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్), టీజీఎల్ఐసీ తో పాటు డీఏ బకాయిలు రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయని రామచంద్రం తెలిపారు. ఈ నిధులతోనే కూతుళ్ల పెళ్లిళ్లు చేయాలని, ఇల్లు నిర్మించుకోవాలని ఆశపడిన రిటైర్డ్ ఉద్యోగులకు బడ్జెట్‌లో నిరాశే ఎదురైందని మండిపడ్డారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల సరైన వైద్యం అందక సుమారు వంద మంది ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వంలో కనికరం లేకపోవడం విచారకరమన్నారు.

## తప్పిన ఎన్నికల హామీలు

ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారని రామచంద్రం విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇస్తామని, వేతన సవరణ సిఫారసులను వెంటనే అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి.. ఇప్పుడు పట్టించుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. 40 ఏళ్ల పాటు ప్రభుత్వ సేవలో ఉండి ప్రజలకు సేవలందించిన వారిని విస్మరించడం తగదని హితవు పలికారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి వారిని ఆదుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



# ఇల్లందకుంట రామాలయ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

## మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా విడుదల

## మంత్రులకు ఆహ్వాన పత్రికల అందజేత

**హుజూరాబాద్ (ఇల్లందకుంట), మార్చి 21 (జనం పవర్):**
అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఆవిష్కరించారు. భక్తుల సౌకర్యార్థం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

## మంత్రులకు ఆహ్వానం

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి వొడితల ప్రణవ్ కు కూడా ఆహ్వాన పత్రికను అందజేసి వేడుకలకు రావాల్సిందిగా కోరారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణ వేడుకలకు కరీంనగర్ జిల్లా ఇన్ చార్జి మంత్రితో పాటు పొన్నం ప్రభాకర్ ను కూడా రావాలని ఆహ్వానించారు.

## ఆలయ మర్యాదలతో సన్మానం

ఈ సందర్భంగా మంత్రులను ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు శాలువాతో ఘనంగా సన్మానించారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన జ్ఞాపికను అందజేశారు. ఆలయ అభివృద్ధి పనుల గురించి మంత్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్, ధర్మకర్తలు పరమేష్, నారాయణరెడ్డి, రాజేందర్, మల్లేష్, రామ్ రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

# ముధోల్ అభివృద్ధికి 70 కోట్ల నిధులు

## సర్పంచులకు ప్రొసీడింగ్స్ అందజేసిన ఎమ్మెల్యే రామారావు పటేల్

## గ్రామాల్లో మారనున్న రూపురేఖలు



**వేల్పుల నగేష్ , జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**
ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తన కోటా నుండి 70 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వెల్లడించారు. శనివారం బైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సర్పంచులకు, నాయకులకు ఆయన స్వయంగా ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.

## నిధుల కేటాయింపుతో గ్రామాల ప్రగతి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి 17 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా సమైక్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాల కోసం 45 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. వీటితో పాటు పొలం బాట పనుల కోసం మరో 8 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని వివరించారు. ఈ నిధులతో గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయని, సర్పంచులు చిత్తశుద్ధితో పనులు పూర్తి చేసి గ్రామాల రూపురేఖలు మార్చాలని ఆయన సూచించారు.

## అసెంబ్లీలో ఫలితం - ప్రాణహిత చేవెళ్ల

అసెంబ్లీలో పదేపదే సమస్యలను ప్రస్తావించడం వల్ల ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం కలగడం శుభసూచకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు పండితరావు పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు మాట్లాడుతూ నిధుల కేటాయింపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనం పవర్
JANAM POWER
ఆదివారం
22 మార్చ్ 2026

# పట్టణ అభివృద్ధే మా లక్ష్యం

**రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే**

**రాష్ట్రంలోనే మంచిర్యాల మొదటి స్థానంలో ఉండాలి**



**వేల్పుల నగేష్ - జనం పవర్ - ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ నుండి శ్రీనివాస్ థియేటర్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శనివారం పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో కలిసి సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోనే మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి విషయంలో ప్రథమ స్థానంలో ఉండాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టణ రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని వెల్లడించారు. రోడ్డు విస్తరణ పనులకు సహకరిస్తున్న వివిధ శాఖల అధికారులకు.. వ్యాపారస్తులకు.. ప్రజలకు ఎమ్మెల్యే హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అందరి భాగస్వామ్యంతోనే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్‌లో మిన్నంటిన రంజాన్ సంబరాలు

**ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యే**

**ఆత్మీయ ఆలింగనాలతో ఈద్ ముబారక్**



**నారాయణఖేడ్, మార్చి 21 (జనం పవర్):**

నారాయణఖేడ్ నియోజకవర్గంలో రంజాన్ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆత్మీయ ఆలింగనాలతో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేశ్ కుమార్ షెట్కర్ పాల్గొని ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ చెప్పారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక నమాజ్ నిర్వహించారు. లోక కల్యాణం కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. ప్రార్థనల అనంతరం చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరినొకరు కౌగిలించుకుని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఇస్తార్ విందులు ఇచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ పండుగ శాంతి, సోదరభావానికి ప్రతీక అని కొనియాడారు. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణమంతా పండుగ సందడితో కోలాహలంగా మారింది.

# జుక్కల్‌లో మిన్నంటిన రంజాన్ వేడుకలు

**ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు శుభాకాంక్షలు**

**శాంతి సామరస్యాలకు రంజాన్ నిదర్శనం**



**జుక్కల్, మార్చి 21 (జనం పవర్):**

పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా మద్నూర్, డోంగ్లీ, బిచ్కుంద మండల కేంద్రాల్లో నిర్వహించిన వేడుకల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

**ఐక్యత.. సోదరభావమే ముఖ్యం**

సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అన్ని మతాల ప్రజలు కలిసి శాంతి, సామరస్యంతో జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని పేర్కొన్నారు. పండుగలు మనుషుల మధ్య అనుబంధాలను బలపరుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఉత్సాహంగా పండుగ సంబరాలు**

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మతపెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరై ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఎమ్మెల్యే రాకతో ఆయా మండల కేంద్రాల్లో పండుగ సందడి మరింత నెలకొంది.



# తంగేడుపల్లి ఆశ్రమంలో ఆధ్యాత్మిక వెలుగు

- నేడు శివయోగి శివాచార్య స్వామి జన్మదిన వేడుకలు
- భక్తి మార్గమే జీవన పరిపూర్ణత

**సంగారెడ్డి, మార్చి 21 (జనం పవర్):**

దైవచింతనతోనే జీవితం సార్థకమవుతుందని నమ్ముతూ ఆధ్యాత్మిక మార్గంలో సాగుతున్న శ్రీ శ్రీ 108 శివయోగి శివాచార్య మహాస్వామి భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గురువు శ్రీ శ్రీ గురు గంగాధర మహాస్వామి ఆశీస్సులతో ఆయన అందిస్తున్న సేవలు సంగారెడ్డి జిల్లాలో విశేషంగా నిలుస్తున్నాయి. 2010 నుంచి సదాశివపేట మండలం తంగేడుపల్లి శివారులోని కోటి బిల్వ లింగేశ్వర మఠం ఆశ్రమానికి ఆయన మఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు.

**నాలుగు రాష్ట్రాల భక్తులకు నిలయం**

ఆశ్రమంలో స్వామివారు నిర్వహించే ఆధ్యాత్మిక ప్రవచనాలు వినేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇక్కడ నిత్యం జరిగే అన్నదానం ఆశ్రమ విశిష్టతను చాటుతోంది. ఉదయం, సాయంత్రం




అల్పాహారంతో పాటు ఎంత మంది వచ్చినా అన్నప్రసాదం అందించడం ఇక్కడి ప్రత్యేకత. ఆశ్రమంలోని గోశాల, కళ్యాణ మండపం, అతిథి గృహాలు భక్తులకు సౌకర్యంగా ఉన్నాయి. వంట చేయడం నుంచి వడ్డించడం వరకు పనులన్నీ భక్తులే స్వచ్ఛందంగా నిర్వహించడం విశేషం.

**ఘనంగా స్వామివారి జన్మదినోత్సవం**

నేడు శివయోగి శివాచార్య మహాస్వామి జన్మదిన



వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆశ్రమంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తంగేడుపల్లి గ్రామంలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. భక్తి భావం, సేవా గుణం కలిసిన ఈ ఆశ్రమం భక్తులకు ఒక గొప్ప ఆధ్యాత్మిక మార్గదర్శిగా నిలుస్తోంది.

# సిద్దిపేటలో రంజాన్ సంబరాలు

## ఖాదర్‌పురా ఈద్గా వద్ద సామూహిక నమాజ్



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలో రంజాన్ పండుగ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. నెల రోజుల కఠోర ఉపవాస దీక్షల అనంతరం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది.

**భక్తిశ్రద్ధలతో సామూహిక ప్రార్థనలు**

ఖాదర్‌పురా వద్ద ఏర్పాటు చేసిన ఈద్గా మైదానంలో వందలాది మంది ముస్లింలు సామూహిక నమాజ్ నిర్వహించారు. కొత్త వస్త్రాలు ధరించిన చిన్నారులు, యువకులు, పెద్దలు ఉదయాన్నే ప్రార్థనలకు హాజరై అల్లాహ్‌ను వేడుకున్నారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖాదర్‌పురా ప్రాంతంలో జరిగిన అలాయి బలాయి కార్యక్రమం ఆత్మీయంగా సాగింది.



**మానవత్వానికి నిదర్శనంగా దానధర్మాలు**

రంజాన్ పర్వదినం సందర్భంగా 'సదకా-తుల్-ఫితర్' రూపంలో పేదలకు దానధర్మాలు చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో నిరుపేదలకు సాయం అందించారు. ఇళ్లలో బిర్యానీ, షీర్ ఖుర్మా వంటి ప్రత్యేక వంటకాలను సిద్ధం చేసి కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ఆనందంగా గడిపారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి శాంతి, సామరస్యాలను చాటుతూ జరుపుకున్న ఈ వేడుకలు సిద్దిపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





# రికార్డు బ్రేక్..

**15 ఏళ్ల ఫానీ ఉటాగుషిమానిండే డెబ్యూతోనే అజేయ సెంచరీ**

**ఫానీ ఉటాగుషిమానిండే డెబ్యూతోనే అజేయ సెంచరీ**

**65 బంతుల్లో అజేయంగా 111 రన్స్ (17 ఫోర్లతో) కొట్టింది**

**టీ20ఐలలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కురాలైన బ్యాట్స్‌మెన్‌గా కూడా రికార్డు**

**ఢిల్లీ:** 15 ఏళ్ల రువాండా క్రికెటర్ ఫానీ ఉటగుషిమనిండే మహిళల క్రికెట్‌లో చరిత్ర సృష్టించింది. ఆమె తన టీ20 అంతర్జాతీయ (ㅇ20×) డెబ్యూ మ్యాచ్‌లోనే సెంచరీ సాధించిన మొదటి మహిళగా నిలిచింది. నైజీరియా ఇన్విటేషనల్ విమెన్స్ టీ20× టోర్నమెంట్‌లో, ఘనాతో జరిగిన మ్యాచ్‌లో (లాగోస్‌లోని తఫావా బాలెవా స్క్వేర్ క్రికెట్ ఓవల్‌లో, మార్చి 20, 2026) ఆమె 65 బంతుల్లో అజేయంగా 111 రన్స్ (17 ఫోర్లతో) కొట్టింది. ఈ భారీ ఇన్నింగ్స్‌తో రువాండా బలమైన స్కోరు సాధించి విజయం సాధించింది. అంతేకాకుండా, టీ20ఐలలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కురాలైన బ్యాట్స్‌మెన్‌గా కూడా ఆమె రికార్డు సృష్టించింది. గతంలో, మహిళల టీ20ఐలో అరంగేట్రం మ్యాచ్‌లో అత్యధిక స్కోరును ఆస్ట్రేలియాకు చెందిన కరెన్ రోల్టన్ నెలకొల్పారు, ఆమె 2005లో ఇంగ్లాండ్‌పై 96లి పరుగులు చేశారు. టీ20ఐలో అత్యంత పిన్న వయస్కురాలైన సెంచరీని ఉగాండాకు చెందిన ప్రోస్కోవియా అలోకా నెలకొల్పారు, ఆమె 16 సంవత్సరాల 233 రోజుల వయస్సులో మాలిపై సెంచరీ సాధించారు. పురుషుల టీ20ఐ క్రికెట్‌లో, నలుగురు బ్యాట్స్‌మెన్లు తమ అరంగేట్రంలోనే శతకాలు సాధించారు, కానీ వారిలో ఎవరూ పూర్తి స్థాయి సభ్య దేశానికి చెందినవారు కాదు. 2022లో ఫిలిప్పీన్స్‌పై అజేయంగా 108 పరుగులు చేసిన కెనడాకు చెందిన మాథ్యూ స్పూర్స్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. పురుషుల టీ20ఐలో శతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడైన బ్యాట్స్‌మెన్ ఫ్రాన్స్‌కు చెందిన గుస్తావ్ మెకాన్. మెకాన్ 18 సంవత్సరాల 280 రోజుల వయస్సులో ఈ ఘనతను సాధించాడు. ఫ్యానీ ఉటాగుషిమానిండే శతకంతో రాణించడంతో, రువాండా తమకు కేటాయించిన 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. 19 బంతుల్లో 32 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టుకు నాయకత్వం వహించిన మెర్వెల్ ఉవాసే కూడా మరో ప్రధాన స్కోరర్‌గా నిలిచింది. ఘనా బౌలింగ్ ఎంతగా చెల్లాచెదురైందంటే, వారు 25 వైడ్‌లతో సహా 28 అదనపు పరుగులు ఇచ్చారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఘనా పూర్తిగా ఒత్తిడికి లోనైనట్లు కనిపించింది. రువాండా బౌలర్లు క్రమంగా తమ పట్టును బిగించి, 20 ఓవర్లలో ఘనాను 8 వికెట్ల నష్టానికి కేవలం 88 పరుగులకే పరిమితం చేశారు. రువాండా ఈ మ్యాచ్‌ను 122 పరుగుల భారీ తేడాతో గెలుచుకుంది.



# 4 ఓవర్లు వేయకపోతే రూ.2 కోట్లు కట్ చేయండి

- **ఆస్ట్రేలియా ప్లేయర్‌పై అశ్విన్ షాకింగ్ కామెంట్స్**



**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌కు మరికొన్ని రోజుల్లో షురూ కానుంది. ఈ సీజన్‌కు ముందు, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ విషయంలో ఒక పెద్ద చర్చ మొదలైంది. గ్రీన్ పాత్ర, ఫిట్‌నెస్‌పై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర విమర్శలు చేశారు. ఒక మ్యాచ్‌లో గ్రీన్ పూర్తి నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయకపోతే.. అతడి జీతం నుంచి రూ.2 కోట్లు కట్ చేయాలని పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026 మినీ-వేలంలో కామెరాన్ గ్రీన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 25.20 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో అతను ఆ వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. సుదీర్ఘ గాయం తర్వాత గ్రీన్ ఇటీవలే క్రికెట్‌లోకి తిరిగి వచ్చాడు. ఈ సీజన్‌లో కేకేఆర్ తరఫున కీలక పాత్ర పోషిస్తాడని అందరూ భావిస్తున్నారు. ఈ తరుణంలో రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా వారి జీతాల నుంచి కోత విధించే హక్కు ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఉండాలన్నారు. ప్రత్యేకంగా కామెరాన్ గ్రీన్‌ను ఉదాహరణగా పేర్కొంటూ, గ్రీన్ కేవలం రెండు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేస్తే.. జట్టు అతని కాంట్రాక్ట్ నుంచి రూ.2కోట్లు తగ్గించాలన్నారు. “మీరు ఐపీఎల్ వేలంలోకి ఎంట్రీ ఇచ్చినప్పుడు.. పూర్తి నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయగలనే అంచనా ఫ్రాంచైజీలకు ఉంటుంది. బ్యాటింగ్ సైతం చేస్తారని అంచనా ఉంటుంది. బౌలింగ్‌పై ఏవైనా ఆంక్షలు ఉంటే ఫర్వాలేదు.. కానీ ఏం లేకుండా కేవలం రెండు ఓవర్లు మాత్రమే వేస్తే మీ కాంట్రాక్ట్ నుంచి నగదు కోతలు విధించే అవకాశం ఫ్రాంచైజీలకు ఉండాలి” అని అశ్విన్ అన్నాడు. ఇక గ్రీన్‌కు ఇటీవల గాయం అయినందున, నాలుగు ఓవర్లు బౌలింగ్ వేయగలడా? అనే చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు.. ఐపీఎల్‌లో కామెరాన్ గ్రీన్‌ను ప్రతి మ్యాచ్‌లో పూర్తి నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయడానికి క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతిస్తుందా? అనే చర్చల మధ్య రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

# ‘కోట్లు పెట్టి కొంటే హ్యాండ్ ఇస్తారా?



- **ఐపీఎల్‌లో విదేశీ ప్లేయర్స్ తీరుపై ఆకాష్ చోప్రా ఫైర్**

**ఢిల్లీ:** ఐపీఎల్ మరో వారం రోజుల్లో ప్రారంభం కానుంది. అప్పటికే అన్ని జట్లు సిద్ధమయ్యాయి. ఇక ఓ అంశం మాత్రం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన బౌలర్లు ఒక్కొక్కరిగా ఐపీఎల్‌కు దూరమవుతున్నారు. దీంతో కోట్లు పెట్టి కొనుగోలు చేసిన ఫ్రాంచైజీలు ఆందోళనకు గురవుతున్నాయి. సన్‌రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఇప్పటికే దూరమయ్యాడు. ఇషాన్ కిషన్‌ను తమ కెప్టెన్‌గా టీమ్ నియమించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు చెందిన జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా టోర్నమెంట్ ప్రారంభానికి దూరమవ్వనున్నాడు. ఇప్పుడు, ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన మిచెల్ స్టార్క్ సైతం ఐపీఎల్ 2026 ప్రారంభానికి అందుబాటులో ఉండడు. ఇలా వరుసగా స్టార్ ప్లేయర్స్ దూరమవుతుండంపై తాజాగా మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా ఫైర్ అయ్యారు. మిచెల్ స్టార్క్ సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదని తెలిసిందన్నారు. ఇప్పటికే జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమిన్స్‌లు దూరమయ్యారని.. తాజాగా స్టార్క్ గాయంతో బాధపడుతున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా పేర్కొందన్నారు. కానీ నిజానికి అతను ఫిట్‌గా ఉన్నప్పటికీ సీఏ మాత్రం ఏవో సాకులు చెప్పి అతన్ని ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడకుండా చూస్తుందని ఆరోపించారు. స్టార్క్ టీ20 క్రికెట్‌కు ఎప్పుడో వీడ్కోలు పలికాడని గుర్తు చేశారు. మరి రెండు నెలలుగా స్టార్క్ విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా ఏం చేసినట్లు? అని నిలదీశారు. “ఆస్ట్రేలియా క్రికెట్ ఎందుకు ఇలా ప్రవర్తిస్తుందో అర్థం కావడం లేదు. మరోవైపు న్యూజిలాండ్ బౌలర్ లోకీ ఫెర్గూసన్ సైతం దూరమయ్యాడు. ఫెర్గూసన్ కుటుంబంతో గడిపేందుకు తొలి ఏడు మ్యాచులకు రాకపోవడం దారుణం.. ప్రెసెంట్ అతను సౌతాఫ్రికాతో 20 సిరీస్‌లు అడుతున్నాడు. ఇది అయిపోగానే వెంటనే కుటుంబంతో గడిపేందుకు వెళ్తాడట. అది అతడి వ్యక్తిగతం కానీ.. అతన్ని రూ. 2 కోట్లకు కొనుగోలు చేశారు. ఏడు మ్యాచుల తర్వాత వచ్చి రూ.కోటి తీసుకుని వెళ్లిపోతాడు. ఐపీఎల్‌లో మాట ఇచ్చి ఏడు మ్యాచ్‌లకు దూరమైతే, టీమ్‌లు ఏం చేయాలి? ఇది సరైన నిర్ణయం కాదు.. జట్టు తీవ్రంగా నష్టపోతుంది.” అని ఆకాష్ చోప్రా వెల్లడించారు. ఇదిలా ఉండగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లో పాట్ కమిన్స్ లేని లోటు స్పష్టంగా కనిపించనుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌లో మిచెల్ స్టార్క్ లేని లోటును పూడ్చేందుకు లుంగీ ఎన్గిడి లేదా కైల్ జేమీసన్ వంటి బౌలర్లపై ఆధారపడాల్సి వస్తుంది. చెన్నై సూపర్ కింగ్స్ లో నాథన్ ఎల్లిస్ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమవ్వడం సీఎస్‌కేకు పెద్ద దెబ్బగా మారనుంది. లక్నో సూపర్ జెయింట్స్ లో వానిందు హసరంగ సైతం గాయంతో బాధపడుతుండటంతో ఆ జట్టు స్పిన్ విభాగంపై ఆందోళన నెలకొంది. విదేశీ ఆటగాళ్ల ఈ తరహా నిర్ణయాల వల్ల ఐపీఎల్ ఫ్రాంచైజీలు భవిష్యత్తులో ఆటగాళ్లను ఎంచుకునేటప్పుడు పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

# ఐపీఎల్ ముందే కేకేఆర్‌కు వరుస దెబ్బలు

**మరో స్టార్ బౌలర్ దూరం..**



**కోల్‌కతా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026కు ముందు, మూడుసార్లు విజేతగా నిలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టుకు సమస్యలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే హర్షిత్ రాణా ఈ టోర్నమెంట్ మొత్తానికి దూరమవ్వగా, ఇప్పుడు మరో ఎదురు దెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ఆకాశ్ దీప్ సైతం ఈ సీజన్‌కు దూరం కానున్నాడు. గతేడాది అబుదాబిలో జరిగిన మినీ వేలంలో కేకేఆర్ జట్టు ఆకాశ్‌ను రూ. 1 కోటికి కొనుగోలు చేసింది. ఇప్పుడు ఆకాశ్ అందుబాటులో లేకపోవడం ఆ జట్టు బౌలింగ్ విభాగానికి పెద్ద దెబ్బగా మారనుంది. వాస్తవానికి.. ఆకాశ్ దీప్‌కు ముందే గాయమైంది. బెంగాల్ తరపున రంజీ ట్రోఫీ సెమీఫైనల్ ఆడుతున్నప్పుడే వెన్నునొప్పి బారిన పడ్డాడు. ఈ గాయం నుంచి కోలుకోవడానికి కనీసం 6 నుంచి 12 వారాల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. మార్చి 18న కోల్‌కతాలో ప్రారంభమైన కేకేఆర్ ప్రీ-సీజన్ క్యాంప్‌కు గానీ, శుక్రవారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌కు గానీ ఆకాశ్ హాజరు కాలేదు. మరోవైపు.. శ్రీలంక పేసర్ మతీషా పతిరానా విషయంలోనూ ఇంత వరకు క్లారిటీ రాలేదు. రాణా భుజం గాయంతో బాధపడుతున్నాడు. ఈ సీజన్‌లో రాణా ఆడతాడా? లేదా? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఈ ఎదురు దెబ్బలతో ప్రస్తుతం కేకేఆర్ బౌలింగ్ విభాగంలో వైభవ్ అరోరా, ఉమ్రాన్ మాలిక్, బ్లెస్సింగ్ ముజరబానీ, కార్తీక్ త్యాగి మాత్రమే ఉన్నారు. ఇక ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు మేనేజ్మెంట్ కసరత్తు షురూ చేసింది. ఈడెన్ గార్డెన్స్‌లో నవదీప్ సైనీ, ఆకాష్ మధ్వాల్, సందీప్ వారియర్ వంటి ఆటగాళ్లతో ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఈ నెల 29 ముంబైతో కేకేఆర్ తొలి మ్యాచ్‌ను ఎదుర్కోనుంది. అంతలోపు మేనేజ్మెంట్ ఏం చేస్తుందో వేచి చూడాలి.

జనం పవర్
JANAM POWER
ఆదివారం
22 మార్చ్ 2026




# నితిన్ మళ్లీ గాడిలో పడేనా?

టాలీవుడ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక్', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ్' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి 'ఆయ్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ. ఈ చిత్రాన్ని నితిన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ట్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. జూలై నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని ఎ÷-లాన్ చేస్తున్నారు. ఇదే కాకుండా, మరో ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒక కొత్త దర్శకుడితో సినిమా చేయడానికి కూడా నితిన్ సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉంది.రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా, కొత్త తరహా కథలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.



# శంబాల దర్శకుడితో సందీప్ కిషన్ మూవీ

యువ కథానాయకుడు సందీప్ కిషన్ తన కెరీర్‌లో మరో మైలురాయి లాంటి ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవలే 'శంబాల' చిత్రంతో సూపర్ హిట్ అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు యుగంధర్ ముని ఇప్పుడు అదే స్థాయి భారీ కాన్సెప్ట్‌తో సందీప్ కిషన్‌ను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా రూపొందుతున్న ఈ చిత్రం ఒక హై-వోల్టేజ్ ఫాంటసీ అడ్వెంచర్‌గా ప్రేక్షకులను అలరించనుంది. కొన్ని యుద్ధాలు ముగియవు.. కొంతమంది రాజులు మరణించరు అనే పవర్‌ఫుల్ మరియు ఇంట్రెస్టింగ్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, ఇది ఒక గొప్ప చారిత్రక లేదా పురాణ సంబంధిత నేపథ్యం ఉన్న ఎపిక్ సాగా అని స్పష్టమవుతోంది. రాజశేఖర్ అన్నభిమోజు మరియు మహిధర్ రెడ్డి సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో, భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్ కెరీర్‌లో 33వ చిత్రంగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్, ఆయన మునుపటి సినిమాల కంటే భిన్నమైన మేకోవర్‌లో ఉండబోతోందని సమాచారం. విజువల్ వండర్‌గా తీర్చిదిద్దనున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సందీప్ కిషన్, ఈ ఎపిక్ సాగాతో పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను విస్తరించుకోనున్నారు.

# పెళ్లిపీటలు ఎక్కిన పునర్నవి



తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి పునర్నవి భూపాలం తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. 'ఉయ్యాల జంపాల' సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టిన ఈ భామ, తన అమాయకత్వం, సహజమైన నటనతో మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. పల్లెటూరి అమ్మాయిగా కనిపించిన ఆమె పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుని, ఆమెను ఇండస్ట్రీకి పరిచయం చేసింది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో కొంతకాలం సినిమాలకు దూరమైంది. ఈ సమయంలోనే బుల్లితెరపై 'బిగ్ బాస్ తెలుగు'లో పాల్గొని మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆమెకు మంచి గుర్తింపు లభించడంతో పాటు అభిమాన వర్గం కూడా పెరిగింది. నిజానికి సినిమాల కంటే ఈ కార్యక్రమం ద్వారానే ఆమెకు ఎక్కువ ప్రాచుర్యం లభించింది. అయితే, వచ్చిన అవకాశాలను పక్కనపెట్టి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు నిర్ణయించుకుంది పునర్నవి. లండన్‌లో చదువులు కొనసాగిస్తూ, పూర్తిగా తన విద్యపై దృష్టి పెట్టింది. అయినప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి అభిమానులతో తన అనుభవాలను పంచుకుంటూ ఉండేది. ఇటీవల డిసెంబర్ నెలలో తాను ప్రేమించిన వ్యక్తితో నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ వార్తతో ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. మార్చి 20న ఆమె తన ప్రియుడు హేమంత్ వర్మను వివాహం చేసుకుంది. హేమంత్ వర్మ ప్రముఖ ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి. వీరిద్దరూ చాలా కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివాహ వేడుకను చాలా సింపుల్‌గా, కుటుంబ సభ్యులు మరియు సన్నిహితుల మధ్య నిర్వహించారు. ప్రైవేట్‌గా జరిగిన ఈ వేడుకకు కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ జంటకు సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్నపునర్నవి ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఇక భవిష్యత్తులో ఆమె మళ్లీ సినిమాల్లోకి వస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.





# నాలుగు గంటల సినిమా.. దమ్ముండాల్సిందే

## దురంధర్ -2 మూవీ అద్భుతం అన్న రాజమౌళి

రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఆదిత్య ధార్ తెరకెక్కించిన 'ధురంధర్ 2: ద రివెంజ్' చిత్రంపై టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. తాజాగా ఈ సినిమా చూసిన జక్కన్న ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. నాలుగు గంటల సినిమా తీయాలంటే దమ్ముండాలని పేర్కొన్నారు. ఈ చిత్రం మొదటి భాగం కంటే స్కేల్ మరియు ఎమోషన్ పరంగా అద్భుతంగా ఉందని, తనకు 'ధురంధర్ 1' అంటే చాలా ఇష్టమని కానీ సీక్వెల్ దానిని మించిపోయిందని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ముఖ్యంగా 4 గంటల సుదీర్ఘ నిడివి ఉన్నప్పటికీ, ప్రేక్షకులను సీటు నుంచి కదలకుండా చేయడంలో దర్శకుడు ఆదిత్య ధార్ విజయం సాధించారని, ఇది ఒక గొప్ప సాహసమని రాజమౌళి కొనియాడారు. రణవీర్ సింగ్ నటనను ప్రస్తావిస్తూ, షెడ్ లో చెల్లెలితో వచ్చే సన్నివేశం ఒక 'మాస్టర్‌క్లాస్ ఇన్ యాక్టింగ్' అని, హమ్జా మరియు జస్కీరత్ పాత్రల్లో ఆయన మెస్మరైజ్ చేశారని అభినందించారు. అలాగే ఆర్. మాధవన్ దేశం నిస్సహాయతను తన నటనతో అద్భుతంగా పండించారని రాజమౌళి ప్రశంసించారు.సినిమాలోని రైటింగ్, మ్యూజిక్, వరల్డ్ డిజైన్ వంటి సాంకేతిక అంశాలు కూడా అద్భుతంగా కుదిరాయని ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ భారీ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద కూడా సునామీ సృష్టిస్తోంది, కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.350 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు తిరగరాస్తోంది.

PRINTED, PUBLISHED and OWNED BY **G.THIRUPATHI,** PRINTED AT **SRK PRINTERS,** (V) KOKKERAKUNTA, RAMADUGU MANDAL, KARIMNAGAR DIST. 505001, TELANGANA,
PUBLISHED FROM H.NO.10-6-219, KISAN NAGAR, KARIMNAGAR 505001, TELANGANA, **RNI NO.TELTEL/2006/69862**, EDITOR: **BANDARI MARUTHI**